క్లుప్తంగా

25 నుంచి విరామ బైబిల్ పాఠశాల

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ ఆంధ్రా కాలనీలో ఉన్న హోరేబు ఆరాధన మందిరంలో ఐదేళ్ల వయసు పైబడిన పిల్లలకు, యువ వయస్కులకు ఈనెల 25 నుంచి మే 6వ తేదీ వరకు విరామ బైబిల్ పాఠశాల (వీబీఎస్) నిర్వహిస్తామని పాస్టర్ బ్రదర్ జాన్, చర్చి పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు వీబీఎస్ ఉంటుందన్నారు. మధుర గీతాలు, లేఖనానుసారంతో చేసే చేతి పనులు ఫ్లాష్ కార్డులు, ఫ్లానల్ గ్రాఫ్ సహాయంతో బోధించే ఆసక్తికర కథలు, వర్తమానములు ఉంటాయన్నారు.

బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ ప్రారంభం

మలక్‌పేట: కరోనా పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శాలివాహననగర్ యూపీహెచ్‌సీలో గురువారం బూస్టర్ డోస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం 'కార్బో వ్యాక్సిన్' బూస్టర్ డోస్‌గా అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యాధికారి డాక్టర్ తరుణ్ మాట్లాడుతూ, మొదటి, రెండో డోసుగా కోవాగ్జిన్, కోవిషీల్డ్‌లలో ఏదీ తీసుకున్నా బూస్టర్ డోస్ తీసుకోవచ్చన్నారు. ఆసుపత్రి సిబ్బంది చంద్రకళ, కళావతి, జ్యోతి, మానస, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ సేవలు భేష్



చేవూరి శంకరయ్యను అభినందిస్తున్న కేవీ రమణాచారి

చంపాపేట: స్వలాభాపేక్ష లేకుండా మదర్ థెరీసా చారిటబుల్ సొసైటీ చేస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఐఏఎస్ కేవీ రమణాచారి కితాబు ఇచ్చారు. గురువారం ఆయన బీఎన్ రెడ్డి కాలనీలో జరిగిన ఓ కార్యక్రమంలో చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు చేవూరి శంకరయ్యకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, భాషా సాంస్కృతిక శాఖా డైరెక్టర్ మామిడి హరికృష్ణ, భువనేశ్వరి, ఆకృతి చైర్మన్ సుధాకర్ పాల్గొన్నారు.

వేడుకగా కాన్వొకేషన్ డే



చంపాపేట: డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్‌లో గల నాగార్జున మాంటిసోరి, ఐఐటీ కాన్సెప్ట్ ఉన్నత పాఠశాలలో గురువారం కాన్వొకేషన్ డే వేడుక సందడిగా సాగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కట్టా రవీందర్ మాట్లాడుతూ...పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం కల్పించి చిన్నారుల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు కృషి చేస్తున్నా మన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్‌లు మాధురి, సరిత, రూప, శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

మలక్‌పేట: తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆ సందర్భంగా అక్బర్‌బాగ్‌లోని మలక్‌పేట అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ మహ్మద్ ముస్తాఫా, సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ విష్ణుమూర్తి, అంజిరెడ్డి, ఫైర్ మెన్లు విజయ్, శ్యామ్, గోపాల్‌రెడ్డి, నరేష్, రంగనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక ఇఫ్తార్

మలక్‌పేట: ఇఫ్తార్ విందులు హిందు, ముస్లింల ఐక్యతను చాటుతాయని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నారంలో లింగాల బస్వరాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా బలాల మాట్లాడుతూ, పండుగలు, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు లింగాల శ్రీనప్పగౌడ్, గొట్టిపర్తి సురేష్‌గౌడ్, మైత్రి కమిటీ చైర్మన్ లింగాల శ్రీనివాస్‌గౌడ్, రంగా విక్రమ్ గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల

దప్పిక తీర్చే కల్పతరువులు చలివేంద్రాలు

- ముదురుతున్న ఎండలు
- దాహార్తితో అల్లాడుతున్న ప్రయాణికులు, బాటసారులు

వనస్థలిపురం: రోజు రోజుకూ ఎండలు ముదురుతున్నాయి... అంతకంతకూ పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి... 41డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇంట్లో ఉంటే ఉక్కపోత, బయటికి వెళ్తే వడగాల్పులు, ఎండల తీవ్రతతో అవస్థలు పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో వివిధ పనులపై బయట తిరిగే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు అల్లాడుతున్నారు. ఎండలకు గొంతె ఎండుతుండటంతో దప్పిక తీర్చుకునేందుకు తంటాలు పడుతున్నారు. ఇలాంటి వారికి మేమున్నామంటూ పలువురు వ్యక్తులు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు దప్పిక తీర్చే కల్పతరువులుగా మారు తున్నాయి. పలు సంస్థలు మార్చి నుంచి మొదలుకొని వర్షాకాలం మొదలయ్యే వరకు తాము ఏర్పాటు చేసిన చలివేంద్రాలలో కుండల్లోని చల్లని నీటిని బాటసారులకు అందజేస్తున్నారు.

మచ్చుకు కొన్ని...

- వనస్థలిపురంలో గణేష్ టెంపుల్ బస్టాప్ వద్ద శ్రీ సత్యసాయి సేవా సమితి, వనస్థలిపురం ఆధ్వర్యంలో 15 ఏళ్లుగా ఎండా కాలంలో చలివేంద్రాలను ఏర్పాటుచేసి బాటసారులకు చల్లని నీటిని అందజేస్తున్నారు.
- వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద వనస్థలి కార్పెంటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా చలివేంద్రంను నిర్వహిస్తున్నారు.
- చింతలకుంట జనప్రియహోమ్స్‌లోని శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి ఆధ్వర్యంలో విజయవాడ జాతీయ రహదారిపై చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహిళా మండలి ఆధ్వర్యంలో గత పదేళ్లుగా చలివేంద్రాలను నిర్వహిస్తున్నారు.
- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎన్జీఓస్ కాలనీకి చెందిన గద్దె విజయ్‌నేత ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎన్జీవోస్ కాలనీ బస్టాండ్, సచివాలయ నగర్, వివేకానంద పార్కుల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.
- యలమంచిలి భానుప్రసాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురం పనామా చౌరస్తా బస్టాప్ వద్ద చలివేంద్రంను ఏర్పాటు చేశారు.
- వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో దాతల సాయంతో ఆయా రోజుల్లో ఆయా ప్రాంతాలలో మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. ఇలా పలుచోట్ల ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఎండా కాలంలో ప్రయాణికుల దప్పికను తీర్చడానికి ఉపకరిస్తున్నాయి.



వనస్థలిపురంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం



రెడ్ వాటర్ ట్యాంక్ వద్ద కార్పెంటర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో..

మాకు సమాచారం ఇవ్వండి.. మీ ఇంటిపై కన్నేసి ఉంచుతాం

- చోరీలు జరగకుండా చూస్తాం
- వేసవి సెలవుల్లో ఊరికెళ్లే వారికి వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి సూచన



హస్తినాపురం: వేసవి సెలవులకు నగరం నుంచి స్వగ్రామాలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలా చేస్తే ఆయా కాలనీల్లో పోలీసు గస్తీని పెంచుతామని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

- వేసవి సెలవుల కోసం ఊళ్లకు వెళ్లేవారు బంగారు ఆభరణాలతో పాటు విలువైన వస్తువులను నగదును ఇళ్లలో ఉంచకూడదు.
- బ్యాంక్ లాకర్‌లో భద్రపర్చుకోవడం లేదా.. తమ వెంట తీసుకెళ్లడం గానీ చేయాలి. ఇంటి సెంట్రల్ లాకింగ్ చేసి గుమ్మం ముందు చెప్పులు ఉంచాలి. పేపర్ బాయికి పేపర్ వేయొద్దని, పాలుపోసే వారికి పాలు పోయొద్దని చెప్పాలి.
- గేటు లోపల తాళం వేయడంతో పాటు ఇంటి ప్రధాన ద్వారం ముందున్న హాల్‌లో లైటు వేసి ఉంచాలి.
- ప్రజలు తమ ఇళ్లలో ఉన్న బీరువాలో ఎట్టి పరిస్థితిలో నగదు, బంగారు, వెండి ఆభరణాలను ఉంచవద్దు.
- ఊరికెళ్లేటప్పుడు పక్క ఇంటివారికి తమ ఇంటిపై ఒక కన్నేసి ఉంచమని చెప్పడంతో పాటు పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలి.
- ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం బయటకు కనిపించకుండా డోర్ కర్టన్ దానిపై చేయడంతో పాటు ఇంటిముందు ముగ్గులు వేసి ఉంచాలి. అంతేకాకుండా తమ ఇంటిపక్క వారికి అప్పుడప్పుడు ఫోన్‌చేసి తమ ఇంటి గురించి వాకబు చేయాలి'' అని సీఐ జలేంధర్‌రెడ్డి అన్నారు.

దైనందిన జీవితంలో యోగా భాగం కావాలి



మాట్లాడుతున్న యోగా గురువు రంగారావు

నాగోలు: యోగా సాధనను మన దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాలని ప్రముఖ యోగా గురువు రంగారావు అన్నారు. కొత్తపేట డివిజన్ స్నేహపురి, న్యూ నాగోల్ సీనియర్ సిటిజెన్ ఫోరమ్‌లో ఆయన ఆధ్వర్యంలో వచ్చే నెల 5 తేదీ వరకు నిర్వహించే ఉచిత వేసవి యోగా శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. న్యూ నాగోల్ సీనియర్ సిటిజెన్ ఫోరమ్ అధ్యక్షుడు కొమర్రాజు జ్ఞాన కుమార్ మాట్లాడుతూ, యోగాను మన దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ఒక గంట యోగాసనాలు, ప్రాణాయామం చేయడానికి కేటాయిస్తే.. మిగతా 23 గంటలు మనం ఎంతో ఉత్సాహంగా ఉంటూ మంచి ఆలోచనలతో సుఖవంతమైన జీవితం గడపవచ్చన్నారు. బతికి ఉన్నత కాలం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండ వచ్చన్నారు. కోశాధికారి లక్ష్మీకాంతారావు, కె సత్తిరెడ్డి, కాలనీ ప్రముఖులు రామకృష్ణారావు, పున్నారావు, రమణమూర్తి, శ్యామ్ సుందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చైతన్యపురి: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. విశ్వచైతన్య ఫౌండేషన్, విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం సంయుక్తంగా సాయినగర్ శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విశ్వచైతన్య ఫౌండేషన్ నిర్వాహకుడు కొండోజు వేణుగోపాల్‌చారి తన జన్మదినం సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు కార్పొరేటర్ అభినందించారు. స్థానిక నాయకులు వినోద్‌యాదవ్, గోవర్ధనాచారి, వెంకటాచారి, శివ ఓజా, పసుపుల హరిబాబు, పెరిక కృష్ణ కాలనీవాసులు పాల్గొన్నారు.

'గురుకులాల కార్యదర్శులను వెంటనే మార్చాలి'

చాదర్‌ఘాట్: మైనార్టీ, సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శులను వెంటనే మార్చాలని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాపని నాగరాజు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకులాల విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ఆయా సొసైటీల కార్యదర్శులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు తప్ప సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యాసంస్థల్లో మెరుగైన ఫలితాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్ రెండు విభాగాలు పర్యవేక్షిస్తున్నందు వల్ల విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అందుకని మైనారిటీ, సాంఘిక సంక్షేమ కార్యదర్శులను మార్చి వేరే వారిని నియమించాలని పాపని నాగరాజు డిమాండ్ చేశారు.

నూతన డ్రైనేజీ పైప్‌లైన్లకు రూ.53.40 లక్షలు మంజూరు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైనేజీ సమస్యలకు చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టామని, నూతన డ్రైనేజీ పైప్‌లైన్లు వేసేందుకు నిధులు మంజూరు చేయించామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని సెంట్రల్ బ్యాంక్ కాలనీలో పర్యటించి డ్రైనేజీ పైపులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలోని రోడ్డు నంబర్ 5 ఏలో రూ.16.80 లక్షలతో నూతనంగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా పద్మావతినగర్, బాలాజీనగర్, చంద్రపురికాలనీ, చిత్రసీమ కాలనీల్లోని డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి రూ.53.40 లక్షల నిధులు మంజూరు చేయించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కాలనీవాసులు హరీష్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సాయికాంత్, ధనుంజయ్, రవీందర్, ప్రకాష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

చంపాపేటను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: వంగ



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకున్న మౌలిక సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన డివిజన్ పరిధిలోని పవన్‌పురి కాలనీలో సర్కిల్, వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...కాలనీలో కొంతమేర తాగు నీటి పైప్‌లైన్ వేయాల్సి ఉండటంతో సీసీ రోడ్డు పనుల్లో జాప్యం జరిగిందని అన్నారు. మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి హయాంలో పద్మానగర్ కాలనీ ప్రధాన రహదారికి మంజూరైన నిధులను పవన్‌పురి కాలనీలో సీసీ రోడ్డు పనులకు మళ్లించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ అధికారులు డీఈఈ రఫీ, ఏఈ సురేష్, జలమండలి డీజీఎం సరిత, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నిర్సింహారెడ్డి, యాదయ్య, చంద్రారెడ్డి, మాధవరెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు సందీప్‌రెడ్డి, దశరథగౌడ్, సుంకరి రమేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'మలబార్'లో ఆభరణాల ప్రదర్శన



ఆర్టిస్ట్రీ ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

చైతన్యపురి: మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం దిల్‌సుఖ్‌నగర్ బ్రాంచిలో ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ విశిష్ట ఆభరణాల ప్రదర్శనను రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛమైన బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభరణాలను అందిస్తూ మలబార్ గ్రూప్ వినియోగదారుల మన్ననలను పొందిందన్నారు. షోరూం హెడ్ రిథీష్ మాట్లాడుతూ, ఈనెల 22 నుంచి 30 వరకు ఆర్టిస్ట్రీ ఆభరణాల ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. మలబార్ 30 ఏళ్ల వేడుకల్లో భాగంగా ప్రతి 30 వేల రూపాయల కొనుగోలుతో 100 మిల్లీగ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మలబార్ షోరూం సిబ్బంది, పలువురు మహిళా వినియోగదారులు పాల్గొన్నారు.

25న మహేశ్వరం బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మురుకుంట్ల అరవింద్, బేరా బాలకిషన్

దిల్‌సుఖ్‌నగర్: విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 25న మహేశ్వరంలో నిర్వహించే బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ కార్యకర్తలు, నాయకుల విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు మురుకుంట్ల అరవింద్, బేరా బాలకిషన్ అన్నారు. గురువారం వారు ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారుమాట్లాడుతూ, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యే సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాలు,, మహిళ నాయకురాలు ఉద్యమకారులు, అభిమానులు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా ప్రతి గ్రామ, మండల మున్సిపల్ డివిజన్ కేంద్రాలలో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు వారి మండల డివిజన్ మున్సిపల్ స్థాయిలో కార్యకర్తలతో త్వరలో మీటింగ్ ఏర్పాటు చేసి ప్రతి ఒక్క కార్యకర్తకు ఈనెల 25న జరిగే మీటింగ్‌లో భాగస్వాములను చేయాలని కోరారు. నియోజకవర్గ ఉపాధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి, నిమ్మల నరేందర్, కార్యదర్శి అం జయ్య గౌడ్, బడంపేట పార్టీ ప్రెసిడెంట్ రామిడి రామిరెడ్డి, మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు అరకల కామేష్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ సాంబశివుడు, సీనియర్ నాయకుడు అంబయ్య యాదవ్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా పట్టదా?: సామ

లింగోజిగూడ: నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మిన్నకుండా ఉండటంలో ఆంతర్యం ఏమిటని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ప్రశ్నించారు. గురువారం లింగోజిగూడ డివిజన్ గ్రీన్ పార్క్ కాలనీలో బీజేపీ బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం రంగారెడ్డి స్థానికులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోడల్ రైతు బజార్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం గ్రీన్ పార్క్ కాలనీలో 3200 గజాలు గతంలో కేటాయించారని, ఆ భూమి అన్యాక్రాంతమవుతున్నా ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇది ప్రభుత్వ భూమిగా గతంలో కోర్టు కూడా తీర్పు ఇచ్చిందన్నారు. ఒక ఎమ్మెల్యేగా కలెక్టర్‌కు ఎన్‌ఓసీ కోసం కనీసం లెటర్ రాసే బాధ్యత సుధీర్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు ప్రవీణ్‌రెడ్డి, రాజేష్, హరికృష్ణ, నాయకులు విజయ్‌భాస్కర్, కృష్ణంరాజు, గట్టు రవి, నాగరాజు పాల్గొన్నారు.

ఓల్డ్ ఈద్గాను సందర్శించిన ఎమ్మెల్యే పాషా ఖాద్రీ



ఈద్గాలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

చంచల్‌గూడ: మాదన్నపేటలోని ఓల్డ్ ఈద్గాను గురువారం యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ సందర్శించారు. రంజాన్ సందర్భంగా ఈద్గాలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ప్రార్థనలకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. ఆయన వెంట వక్ఫ్ బోర్డు చైర్మన్ మసివుల్లాఖాన్, జీహెచ్‌ఎంసీ డీసీ నరసింహ, మాదన్నపేట సీఐ జానయ్య, సంతోష్‌నగర్ కార్పొరేటర్ ముజఫర్ హుస్సేన్ పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే లక్ష్యం: సీపీఐ

సైదాబాద్: రాష్ట్రంలో, దేశంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీని ఓడించడమే లక్ష్యంగా కమ్యూనిస్టు నాయకులు పోరాడతారని ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో బీజేపీ హఠావో- దేశ్‌కో బచావో పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సీపీఐ శ్రేణులతో కలిసి ఇంటింటికీ కరపత్రాలు పంచి బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శంకర్‌నాయక్, అమీన, దశరథ్, సుజాత, రేష్మ, అంజి, సల్మాన్, ఫెరోజ్ పాల్గొన్నారు.

'సింగరేణి'లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయండి



సింగరేణి కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్, అధికారులు

సైదాబాద్: నగరంలోనే అతిపెద్ద బస్తీల్లో ఒకటైన సింగరేణి కాలనీలో బస్తీ దవాఖానా ఏర్పాటు చేయాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అధికారులను కోరారు. నిరుపేదలు, దినసరి కూలీలు అధికంగా నివసించే సింగరేణి కాలనీలో ఎవరికి చిన్నపాటి ఆరోగ్య సమస్య తలెత్తినా సమీపంలో ప్రభుత్వ ఆసుపత్రులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ క్లినిక్‌లను ఆశ్రయించాల్సి వస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సింగరేణి కాలనీ గుడిసెల్లో స్థానికులు, అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో కార్పొరేటర్ పాల్గొన్నారు. బస్తీవాసులు పలు సమస్యలను అధికారులు, కార్పొరేటర్‌కు వివరించారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పూడిక తీయకపోవడంతో డ్రైనేజీలు నిండి బస్తీ అంతర్గత రహదారులపై పారుతోందని చెప్పారు. బస్తీవాసులు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ అధికారులను కోరారు. సమావేశంలో డీపీఓ రత్తమ్మ, ఏఈ అన్సారీ, వాటర్‌వర్క్స్ అధికారిణి రమ్యభారతి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అరిగోస పట్టదా?

విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కరువై విద్యార్థులు అరిగోస పడుతున్నారని, మీ పిల్లలకో న్యాయం..పేదల పిల్లలకో న్యాయమా అని విశ్రాంత ఐఏఎస్ అధికారి, ఎస్‌డీఎఫ్ కన్వీనర్ ఆకునూరి మురళి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రశ్నించారు. సోషల్ డెమోక్రాటిక్ ఫోరం సభ్యులు, కో కన్వీనర్లు ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పృథ్వీరాజ్‌లతో కలిసి ఆయన గురువారం సరూర్‌నగర్ మండలంలోని భూపేష్‌గుప్తానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భగా ఆకునూరి మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మన ఊరు.. మన బడి పథకానికి సున్నా మార్కులు వేయాలన్నారు. పాఠశాల ప్రహరీ కూలిపోవడం, గోడకు ఫెన్సింగ్ లేకపోవడంతో పాఠశాల అసాంఘిక శక్తులకు అడ్డాగా మారిందన్నారు. మద్యం, గంజాయి సేవిస్తూ తరగతి గదుల్లో మలమూత్ర విసర్జన చేస్తున్నారన్నారు. మరుగుదొడ్లు ఉన్నా.. నీటి సరఫరా లేకపోవడంతో నిరూపయోగంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. మన ఊరు.. మన బడి పథకం కింద రూ.14 లక్షలు మంజూరైనా ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు ఎకరాల స్థలంలో 300 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు నిధులు ఖర్చు చేయకపోవడం ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యానికి తార్కాణమన్నారు. ప్రభుత్వ విద్యపై పాలకులకు చిత్తశుద్ధి లేదని, సీఎం కేసీఆర్‌కు తన మనుమడి పాఠశాల ఓక్రిడ్జ్ స్కూల్‌ను చూసినప్పుడైన ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగు పర్చాలని అనిపించాలేదా అని మురళి అన్నారు.

ఫ్లవర్ పార్కును అద్భుతంగా నిర్మిస్తాం

- వారం రోజుల్లో కోర్టులో ఉన్న వివాదం పరిష్కారమవుతుంది
- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆటోనగర్ చెత్త డంపింగ్‌యార్డ్‌ను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: ఆటోనగర్ చెత్త డంపింగ్ యార్డ్ ప్రాంతంలో ఫ్లవర్ పార్కును అద్భుతంగా నిర్మిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సత్యనారాయణతో కలిసి గురువారం ఆయన డంపింగ్‌యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 2007లో బయోమైనింగ్‌లో భాగంగా శ్రీభవానీ ఎంటర్‌ప్రైజెస్ సంస్థకు డంపింగ్‌యార్డ్ ఎత్తివేసే విధంగా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందన్నారు. సదరు సంస్థ పనులు చేపట్టలేకపోవడంతో ప్రభుత్వం ఆ పనులను తొలగించిందన్నారు. దీంతో సదరు సంస్థ కోర్టుకు వెళ్లటంలో ఫ్లవర్ పార్కు నిర్మాణ పనులు అనుకున్న సమయంలో చేపట్టలేకపోయామన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి శ్రీభవానీ ఎంటర్ ప్రైజెస్ కోర్టు కేసును విరమించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వివాదం పరిష్కారం కోసం అనుభవం ఉన్న కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి సత్యనారాయణను ప్రత్యేక అధికారిగా నియమించారన్నారు. వారం రోజుల్లోగా కోర్టు వివాదం పరిష్కారం అవుతుందని, వెంటనే ప్రహరీ నిర్మిస్తామన్నారు. దేశంలోనే అత్యుత్తమ ఫ్లవర్ పార్కును నిర్మించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రాకేష్, భాస్కర్ యాదవ్, సంస్థ సభ్యులు నరేష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.